
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
గురువారం 8 ఆగస్టు 2024



పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు తాగించాలి 8
పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత 8

కానరాని కు.ని. శిబిరాలు

- ఆపరేషన్లకు దూరం
- అవగాహన కల్పించేవారు లేరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

జగిత్యాల మాతా శిశు కేంద్రం



జగిత్యాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కుటుంబ నియంత్రణ శిబిరాలు పత్తా లేకుండా పోయాయి. సుమారు రెండు సంవత్సరాలుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుటుంబ నియంత్రణ శిబిరాలు నిలిచిపోవడం వల్ల పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తప్పని సరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు అన్ని వైద్య సేవలు అందుబాటులో ఉండాలని ప్రభుత్వాలు పదే పదే చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. 'ఒక్కరు చాలు..ఇద్దరు ముద్దు' అనే నినాదంతో పలు సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించి శిబిరాల నిర్వహణతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు గతంలో పూర్తి చేసే వారు. గతంలో ఆపరేషన్ల కోసం మండలాల వారీగా తేదీలను ప్రకటించి సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా నిర్వహించే వారు. సుమారు రెండు, మూడు సంవత్సరాల నుంచి ప్రభుత్వ ఆసుపత్రుల్లో శిబిరాలను నిర్వహించడం లేదు.

పేదలపై ఆర్థికభారం

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుటుంబ నియంత్రణ శిబిరాల నిర్వహణ లేక పోవడం వల్ల పేదలపై ఆర్థిక భారం పడుతోంది. దీంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు పలువురు అర్హులైన దంపతులు దూరంగా ఉంటున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చేసుకోలేక, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్వహణ లేక పోవడం వల్ల ఇబ్బందుల పాలవుతున్నారు. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలకు మండల కేంద్రాలల్లో ఉండే చిన్న చిన్న ప్రైవేటు ఆసుపత్రులు సుమారు రూ. 15 వేల నుంచి రూ. 20 వేల వరకు వసూలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ వంటి పట్టణ ప్రాంతాల్లో ఉండే పలు ప్రైవేటు ఆసుపత్రులు సుమారు రూ. 25 వేల నుంచి రూ. 30 వేల వరకు తీసుకుంటున్నారు.

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో కాన్పులు ఇలా..

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో 2023-24 సంవత్సరంలో 10,409 ప్రసవాలు జరిగాయి. ఇందులో సాధారణ ప్రసవాలు 2,528, శస్త్ర చికిత్స ప్రసవాలు 7,881 ఉన్నాయి. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 5,405 ప్రసవాలు జరగగా 1,879 సాధారణ, 3,526 శస్త్ర చికిత్స ప్రసవాలు జరిగాయి. అదే విధంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో 5,004 ప్రసవాలు జరగగా 649 సాధారణ, 4,355 శస్త్రచికిత్స ప్రసవాలు జరిగాయి. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలను పనిభారంగా పలువురు వైద్యులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. చాలా వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుటుంబ నియంత్రణ పూర్తిగా నిలిచిపోయినట్లు ప్రజలు భావిస్తున్నారు.

ఆసుపత్రుల్లో నిపుణుల కొరత

కుటుంబ నియంత్రణ శిబిరాలను నిర్వహించేందుకు అవసరమైన వైద్య నిపుణుల కొరత వల్లే సమస్య ఏర్పడ్డట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి. శస్త్రచికిత్స నిర్వహణకు అవసరమైన సర్జన్ వైద్యులతో పాటు లాప్రోస్కోపిక్, గైనకాలజీ నిపుణుల కొరత సైతం ఉండడం వల్ల ఆసుపత్రులో శిబిరాల నిర్వహణకు ఇబ్బంది కలుగుతోందంటున్నారు. దీనికి తోడు కుటుంబ నియంత్రణ శిబిరాల నిర్వహణకు ప్రభుత్వం నుంచి సైతం కొంతకాలంగా ఎటువంటి ఆదేశాలు రాక పోవడం కారణంగా తెలుస్తోంది. ప్రస్తుతం నెలకొన్న సమస్యలను పరిష్కరించి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు కొనసాగించేలా అధికారులు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజల్లో అవగాహన పెరిగింది

డాక్టర్ సమియోద్దీన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి



గతంలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలపై అర్హులైన దంపతులకు అవగాహన ఉండేది కాదు. అందుకే కుటుంబ నియంత్రణ శిబిరాలు ఎక్కువగా నిర్వహించారు. ప్రస్తుతం అర్హులైన దంపతుల్లో అవగాహణ పెరిగింది. దీంతో కుటుంబ నియంత్రణ శిబిరాలు అంతగా జరగడం లేదు. అయినప్పటికీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.



అందని ప్రోత్సాహకాలు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించుకుంటే గతంలో ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించేది. ఎస్సీ, ఎస్టీ మహిళలకు రూ.880, ఇతరులకు రూ.660 ప్రోత్సాహక సొమ్మును ప్రభుత్వం ఇచ్చింది. ఈ మొత్తం రవాణా ఖర్చులతో పాటు పండ్ల కొనుగోలుకు ఉపయోగపడేవి. ప్రస్తుతం ఆపరేషన్లు లేకపోవడంతో ఇవి కూడా నిలిచిపోయాయి. దీనికి తోడు గతంలో ఆపరేషన్లు చేయించుకున్న వారికి సైతం ప్రోత్సాహక సొమ్ము అందాల్సి ఉన్నట్లు వైద్య వర్గాలు అంటున్నాయి. అదే విధంగా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్యునికి రూ.100, శస్త్ర చికిత్సకు సహాయ కులుగా నిలిచిన వైద్య సిబ్బందికి రూ.15లను ప్రభుత్వం అందించేది. కొన్ని సంవత్స రాలుగా నిపుణులైన వైద్యులు, వైద్య సిబ్బందికి అందాల్సిన ప్రోత్సాహం నిలిచిపోయింది. పొరుగు జిల్లాల్లో వైద్యుడు, వైద్య సిబ్బందికి ప్రోత్సాహక సొమ్ము అందిస్తు న్నప్పటికీ జగిత్యాల జిల్లాలో అమలు కావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

పాఠశాల, కళాశాల సమయానికి బస్సు నడపాలి

- ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌కు జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల అర్బన్/రాయికల్, ఆగస్టు 7: రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామ శివారులో ఉన్న మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం బస్సును నడపాలని కోరుతూ కరీంనగర్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌కు జీవన్‌రెడ్డి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆర్టీసీ బస్సు జగిత్యాల నుంచి ఉదయం 8గంటలకు బయలుదేరుతుందని పోరండ్ల, నాగునూర్ లచ్చక్కపేట్, రాజ్‌నగర్, ఆలూర్, తాట్లవాయి, దావనపల్లి , వస్తాపూర్, వొడ్డె లింగాపూర్, భూపతిపూర్, రామోజీపేట్ గ్రామం మీదుగా ఇటిక్యాలకు చేరుకుని, తిరిగి రాయికల్ హెడ్‌క్వాటర్ నుంచి అల్లీపూర్ మీదుగా జగిత్యాలకు రావడంతో చాలా మందికి సౌకర్యం లభిస్తుందన్నారు. కావున ఇటిక్యాల స్కూల్, కళాశాలకు అనుకూలమైన సమయాల్లో నడిచే విధంగా బస్సు మంజూరు చేయాలని కోరారు.

నేటి నుంచి ఓపెన్ స్కూల్ అడ్మిషన్స్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 7: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఓపెన్‌స్కూల్ విధానంలో ఎస్సెస్సీ, ఇంటర్మీడియేట్ పూర్తి చేసేందుకు ఈ నెల 8వ తేదీ నుంచి అడ్మిషన్స్ ప్రారంభమవుతుందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్ చల్వాజీ నాగేశ్వర్‌రావు, జగిత్యాల ఏఐ కోఆర్డినేటర్ అనుమల్ల శ్యామ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్‌లు ప్రారంభం అవుతున్నందున బడి మధ్యలో మానేసిన వారు, పదోతరగతి ఫెయిల్ అయిన వారు ఇంటర్మీడియేట్ ఫెయిల్ అయిన వారికి ఇంటర్మీడియేట్ కోర్సు చదువుకునే అవకాశం ఉందన్నారు. మహిళలకు పలు వృత్తి వ్యాపార రంగాలలో ఉన్నవారికి, ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులకు వివిధ సంఘ సభ్యులకు ఇది సదావకాశమని తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు అడ్మిషన్‌లు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. అనుమల్ల శ్యామ్ తపోవన్ స్కూల్ జగిత్యాల ఏఐ కోఆర్డినేటర్ సెల్:9489266786కు సంప్రదించాలని తెలిపారు.

ఇన్‌చార్జి డీటీఓగా శ్రీనివాస్

జగిత్యాలరూరల్, ఆగస్టు 7:జగిత్యాల జిల్లా రవాణాశాఖ ఇన్‌చార్జి రవాణాశాఖ అధికారిగా ఎం.శ్రీనివాస్ బుధవారం జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపల్లి రవాణాశాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇన్‌చార్జి రవాణాశాఖ అధికారిగా పనిచేసిన వంశీధర్ సిరిసిల్లకు బదిలీకాగా ఆయన స్థానంలో కోరుట్ల ఎంవిఐగా ఎం. శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

చేనేత కార్మికులకు సన్మానం



చేనేత కార్మికులను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

రాయికల్, ఆగస్టు 7: రాయికల్ పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నేత కార్మికులైన దాసరి గంగాధర్, అనుమండ్ల భూమరాజం, దాసరి చిన్న గంగారాం, కట్కం గంగారాం, తాటిపాముల వెంకటిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు తాటిపాముల విశ్వనాథం, ఉపాధ్యక్షులు శ్రీరాముల సత్యనారాయణ, సిరిపురం రఘు, సహాయ కార్యదర్శి జక్కుల రవి, యువజన సంఘం అధ్యక్షుడు సామల సతీష్, కార్యదర్శి ఆడెపు రాజీవ్, కోశాధికారి కొమ్మకంటి నవీన్, ఉపాధ్యక్షులు సింగని సతీష్, ఎలిగేటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

రాయికల్, ఆగస్టు 7: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌లు అన్నారు. రాయికల్ మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు, బాలికలు, ఉర్దూ మీడియం పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. విద్యార్థులు విద్యతో పాటు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మ్యాకల అనురాధ, ప్రధానోపాధ్యాయుడు శ్రీపతి రాఘవులు, చెరుకు మహేశ్వర శర్మ, ఎండీ లయాకుద్దీన్, మున్సిపల్ సిబ్బంది ప్రత్యూష, సుష్మా, ఉపాధ్యాయులు ఉన్నారు.

అన్ని రంగాల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలి

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి



గాంధీభవన్ వద్ద నిరసనలో పాల్గొన్న జిల్లా నాయకులు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 7: మహిళలకు అన్నిరంగాల్లో 33శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీ దేవేందర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్‌లు అన్ని రంగాల్లో అమలు చేయాలనే డిమాండ్‌తో హైద్రాబాద్‌లోని గాంధీభవన్‌లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతరావు ఆధ్వర్యంలో 'మహిళా న్యాయం.. ఉద్యమం' పేరున నిరసన తెలపగా, జగిత్యాలకు చెందిన మహిళా కాంగ్రెస్ బాధ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయలక్ష్మీ మాట్లాడుతూ దేశంలో మహిళలపై జరుగుతున్న హింసను, ఆకృత్యాలను , అఘాయిత్యాలను వెంటనే నిలుపుదల చేయాలని, మహిళలపై అణచివేత వైఖరి బీజేపీ ప్రభుత్వంలో ఇంకెంత కాలం ఉంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వేషన్‌లు అమలుచేసి కేంద్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తాటిపర్తి శోభారాణి, రాయికల్ మండల అధ్యక్షురాలు భారతి, జగిత్యాల పట్టణ అధ్యక్షురాలు అనిత తదితరులున్నారు.

పట్టణ ఆర్యవైశ్య సంఘ సభ్యత్వ నమోదు ప్రారంభం

జగిత్యాలరూరల్, ఆగస్టు 7: జగిత్యాల పట్టణ ఆర్యవైశ్య సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. ఈ సభ్యత్వ నమోదు 7 నుంచి 17 వ తేదీ వరకు స్వీకరిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆర్యవైశ్యులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు ఒక ప్రకటనలో కోరారు.

సమన్వయ కమిటీలు పార్టీని పటిష్టం చేయాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 7: పార్టీకి కార్యకర్తలు పట్టుకొమ్మలని, పార్టీని ముందుకు నడిపేందుకు ఏర్పాటు చేసిన కమిటీలు పార్టీ పటిష్టత కోసం పనిచేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు అధ్యక్షతన జగిత్యాల నియోజకవర్గంలోని మండలాలకు చెందిన సమన్వయ కమిటీలను ఆయా మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా కమిటీ బాధ్యులు, పార్టీ అభిమానులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎల్ రమణ మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని , ప్రజాసమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. రుణమాఫీ కాని వారికి బీఆర్ఎస్ పార్టీ కేటాయించిన వాట్సాప్ నెంబర్‌కు మాఫీ కాని రైతుల వివరాలు పంపాలని సూచించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత మాట్లాడుతూ అందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి తోడ్పాటును అందించాలని కోరారు. మాజీ మంత్రి రాజేశం గౌడ్ మాట్లాడుతూ కేసీఆర్ చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాల వల్లనే రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్ర బడ్జెట్‌లో రుణమాఫీకి సంబంధించి కేటాయింపులు జరగలేదని, మహాలక్ష్మీ స్కీంకు సైతం బడ్జెట్‌లో ఊసే లేదన్నారు. మరోమారు బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు మనోధైర్యం కోల్పోవద్దన్నారు. జగిత్యాల రూరల్ మండల సమన్వయ కమిటీ సభ్యులుగా పూదరి శ్రీనివాస్, ఆసిఫ్, పడిగెల గంగారెడ్డి, ఆనందరావు, గంగారాం, లక్ష్మణ్, శ్రీనివాస్,లింగన్న, యువజన విభాగం సభ్యులుగా హరీష్, చందు, సదానందం, రాకేష్ తోపాటు అర్బన్ మండలం కమిటీ సభ్యులుగా గంగాధర్, లక్ష్మణ్‌రావు, ముత్తయ్య, యువజన విభాగం బాధ్యులుగా సన్నిత్‌రావు, అనిల్, సారంగాపూర్ మండల కమిటీ సభ్యులుగా తేలు రాజు, ఎండబెట్ల ప్రసాద్, సత్యంరావు, గంగారెడ్డి, వొద్నాల జగన్, రాయికల్ మండల కమిటీ సభ్యులుగా సురేందర్ నాయక్, మల్లేష్ యాదవ్, వేణు, నాగరాజు, గంగారాం, రత్నాకర్‌రావులను నియమించి నియామకపత్రాలు అందజేశారు.

గిరిజన దినోత్సవ నిర్వహణపై హర్షం

జగిత్యాల అర్బన్, ఆగస్టు 7: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంఘాల విన్నపాలు, పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం గిరిజన దినోత్సవాన్ని ఈ నెల 9న అధికారికంగా నిర్వహించేందుకు ఉత్తర్వులు ఇవ్వడం హర్షణీయం అని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్షుడు నునావత్ రాజు, ప్రధాన కార్యదర్శి జరుపుల గోవింద్ నాయక్ అన్నారు. జిల్లా మండల కేంద్రాల్లో గిరిజన పాఠశాలల్లో గిరిజన సాంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని పేర్కొన్నారన్నారు.

మాజీ ఎమ్మెల్యే, మాజీ జడ్పీచైర్‌పర్సన్ పూజలు

జగిత్యాలరూరల్, ఆగస్టు 7 : జగిత్యాల పట్టణంలోని ధరూర్ క్యాంపు కోదండరామాలయంలో శ్రావణమాసం సందర్భంగా బీఆర్ఎస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, మాజీ జడ్పీచైర్‌పర్సన్ దావ వసంత సురేష్ కోదండరామాలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇటీవలే టీటీడీ ద్వారా ఆలయ అభివృద్ధికి మంజూరైన రూ. 10 లక్షల రూపాయల ప్రొసీడింగ్ పత్రాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ శ్రీలత, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సౌకర్యాలు కల్పించాలని వినతి



ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న పాఠకులు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 7: జగిత్యాల గ్రంథాలయంలో విద్యార్థుల పోటీ పరీక్షలకు అవసరమైన పాఠ్యపుస్తకాలను అందుబాటులో ఉంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు పాఠకులు వినతిపత్రం సమర్పించారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే విద్యార్థులకు అవసరమైన వసతులు, పోటీ పరీక్షల పుస్తకాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

- జగిత్యాల అర్బన్ మండలం అంబారీపేట గ్రామానికి చెందిన ఊరెడి తిరుమల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న సందర్భంలో సమస్య ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దృష్టికి వచ్చింది. దీంతో స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయ నిధి ద్వారా రూ.85వేల ఎల్‌వోసీని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోహెల్, శేఖర్, సంగెపు శ్రీనివాస్ తదితరులున్నారు.

వాటర్ ప్లాంట్‌ను పరిశీలించిన నిపుణుల బృందం

రాయికల్, ఆగస్టు 7: రాయికల్ జూనియర్ కళాశాలలో కొన్ని నెలలుగా మూతపడి ఉన్న వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం నిపుణుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా సాంకేతిక నిపుణులతో పరిశీలింపజేసి, మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయించేలా చూడాలని జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొయ్యడి మహిపాల్‌రెడ్డికి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. సమస్యల పట్ల వెంటనే స్పందించి పనులను ప్రారంభింపజేసిన జీవన్ రెడ్డికి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జిందం రాజేష్, పూర్వ విద్యార్థి రవి, ఉపన్యాసకులు చౌడారం శ్రీనివాస్, రాజమౌళి, మనోహర్‌రెడ్డి, ఉపాధ్యాయులకు తెలిపారు.

పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి పరామర్శ

రాయికల్, ఆగస్టు 7: విష జ్వరంతో మృతి చెందిన మున్సిపాలిటీ శానిటేషన్ వర్కర్ దువ్వాక లింగం కుటుంబాన్ని రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, కమిషనర్ జగదీశ్వర్ గౌడ్‌లు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా లింగం భౌతికదేహం వద్ద నివాళులర్పించారు. దహన సంస్కారాల నిమిత్తం రూ.10 వేలు అందజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

రాయికల్, ఆగస్టు 7: మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చొరవతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఇద్దరు లబ్ధిదారులకు 41,500ల విలువ గల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, నాయకులు తలారి రాజేష్, అనుమల్ల సత్యనారాయణ, బూస గంగమల్లయ్య, నేమిల్ల స్వామి రెడ్డి, కొల్ల వేణు, నెమిల్ల లింగారెడ్డి, దొంగ ప్రణయ్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి



నర్సరీని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

రాయికల్, ఆగస్టు 7: సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా భూపతిపూర్ గ్రామాన్ని అడిషనల్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీని, పిచ్చి మొక్కలను తొలగించాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో ముచ్చటించి పాఠశాల పరిసరాలను, నర్సరీని తనిఖీ చేశారు. ప్రైమరీ స్కూల్, హెల్త్ సబ్‌సెంటర్, గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో సుష్మా, గ్రామ పంచాయతీ సిబ

స్వచ్ఛదనం-పచ్చదనంలో లక్ష్యం చేరుకోవాలి

మల్లాపూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో నిర్ధేశించిన లక్ష్యాన్ని చేరుకునే విధంగా పనులు చేపట్టాలని అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులు, కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో చేస్తున్న పారిశుధ్యం పనులు, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు చేస్తున్న అవగాహన కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు సోకకుండా నివారణ చర్యలు తీసుకోవాలని, వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో ప్రతినిత్యం పారిశుధ్యం పనులు చేపట్టాలన్నారు. పనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చారించారు. కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, ఎంపీవో, కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ విజయోత్సవ సభను విజయవంతం చేయాలి



ఆహ్వానం పలుకుతున్న నాయకులు

భీమారం, ఆగస్టు 7: సుప్రీంకోర్టు జడ్జిల ధర్మాసనం ఎస్సీ వర్గీకరణకు తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఈ నెల 12న జరుగనున్న విజయోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లి ఆహ్వానం పలికారు. మాజీ ఎంపీపీ మకిలి ఇజ్రాయిల్, నాయకులు దువాస గంగాధర్, బంగారు దీపక్, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

చెత్త సేకరణ చేయాలని కమిషనర్‌కు వినతి

రాయికల్, ఆగస్టు 7: వార్డులో పేరుకుపోతున్న చెత్త సేకరణ చేయాలని కోరుతూ కౌన్సిలర్ కన్నాక మహేందర్, వార్డు సభ్యులు బుధవారం మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. రాయికల్ పట్టణంలోని 2వ వార్డులో గత నెల రోజులుగా చెత్త సేకరణ చేయడం లేదని, రోడ్లు, డ్రైనేజీ పరిశుభ్రత జరుగడం లేదన్నారు. రోడ్లపై వర్షపు నీరు నిలువడంతో దుర్గంధంతో దోమల బెడద ఎక్కువైందని పేర్కొన్నారు. త్వరగా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 7: కరీంనగర్‌లో రెండు రోజుల కిందట వైన్‌షాపులో దొంగతనానికి పాల్పడిన కేసులో నిందితుడు మహారాష్ట్ర అమరావతి జిల్లా వరుడ్ ప్రాంతానికి చెందిన దుర్వ అజయ్(20)ను బుధవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. నిందితుడు ఒక వైన్ షాపులో 35 వేల నగదును దొంగిలించాడని, తన అనుచరులతో కలిసి మరో వైన్ షాపులో చోరీకి ప్రయత్నించినట్లు తెలిపారు. నిందితుడిని ఉజ్వలపార్క్ సమీపంలో అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ.20 వేల నగదు, సికింద్రాబాద్‌లో దొంగిలించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వీధి కుక్క దాడిలో చిన్నారికి గాయాలు


గాయపడిన చిన్నారి హరినందన్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 7: నగరంలో శాతవాహన యూనివర్సిటీ రోడ్డులోని ఆర్ఆర్ బాంక్విట్ హాల్ ముందు బుధవారం సాయంత్రం రెండేళ్ల వయసు కలిగిన చిన్నారిపై వీధి కుక్క ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. జీవనోపాధి కోసం తంగళ్ళపల్లి పద్మ, వినోద్ అనే దంపతులు కరీంనగర్‌కు వచ్చి కుటుంబంతో జీవిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు కాగా, చిన్న కుమారుడు తంగళ్ళపల్లి హరినందన్‌ను అమ్మమ్మ ఆడిస్తుండగా రోడ్డుపై నుంచి వెళ్తున్న వీధి కుక్క దాడి చేసింది.

దీంతో చిన్నారి ముఖం, చేతులపై గాయాలు కాగా కుక్కను అమ్మమ్మతో పాటు అక్కడున్న వారు కుక్కను వెళ్ల గొట్టే ప్రయత్నం చేస్తున్నా బాబును వదిలిపెట్టలేదు. చివరకు ఇటుకలు, రాళ్ళను కుక్కపైకి విసరడంతో చిన్నారిని వదిలిపెట్టి కుక్క వెళ్లింది. స్పృహ కోల్పోయిన చిన్నారిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, తమ కళ్లముందే చిన్నారిపై కుక్క దాడి చేయడంతో తల్లిదండ్రులు, అమ్మమ్మ తీవ్రంగా విలపించారు. వీధి కుక్కల బెడదను నివారించి దాడికి గురైన చిన్నారికి మెరుగైన చికిత్స ను అందించి, వారి కుటుంబానికి ప్రభుత్వం సహాయం చేయాలని స్థానికులు కోరారు.

హమాలీలపై కుక్కల దాడి

కోల్‌సిటీటౌన్: గోదావరిఖని కొత్త కూరగాయల మార్కెట్‌లో బుధవారం ఇద్దరు హమాలీలపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో పరమేశ్వర్ అనే హమాలీకి వీపు, తొంటి భాగంలో తీవ్రంగా గాయాలు కాగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. అక్కడ ఉన్న మిగతా వారు కుక్కలను తరిమికొట్టారు. గాయాలైన పరమేశ్వర్‌ను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి చికిత్స నిమిత్తం పంపించారు.

శ్రీపాద ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి/ధర్మారం/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ప్రాజెక్టులోకి బుధవారం సాయంత్రం 6 గంటల వరకు 6,752 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ప్రాజెక్టు నుంచి నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని మిడ్ మానేరులోకి తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.75 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఇప్పటి వరకు 12 టీఎంసీల నీరు మిడ్‌మానేరుకు తరలించినట్లు అధికారులు తెలిపారు. మిడ్ మానేరు ప్రాజెక్టులోకు ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 6300 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 17.06 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 1.25 టీఎంసీల నీరు చేరింది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి మధ్యమానేరు నుంచి నీరు వస్తుండగా రెండు మోటర్ల ద్వారా ప్రతి రోజు 3400క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి రంగనాయకసాగర్‌కు 3,600 క్యూసెక్కుల నీరు వెళుతుందని డీఈ దేవేందర్ తెలిపారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌ను పూర్తిగా నింపిన తర్వాత మండలానికి ఉపయోగపడతాయనుకుంటే గతంలో మాదిరిగానే రంగనాయకసాగర్‌కు ఎక్కువ నీటిని విడుదల చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీఫార్మసీ పరీక్షల ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఆగస్టు 7: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జూలై- 2024 లో నిర్వహించిన బీఫార్మసీ ఏడవ, ఎనిమిదో సెమిస్టర్ పరీక్షల ఫలితాల ను బుధవారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ విడుదల చేశారు. ఈ ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.in.లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట, ఆగస్టు 7: ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ఏడు ట్రాక్టర్లను వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం పోలీసులు పట్టుకున్నారు. కోరపల్లిలో 2, సాయి గార్డెన్ దగ్గర 1, ధర్మారం 4, మొత్తం ఏడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వేణు, మహేందర్, పరుశురాము, ప్రవీణ్ కుమార్, తిరు పతి, వి తిరుపతి, కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ వరంగంటి రవి తెలిపారు.

సైబర్ వలలో ప్రభుత్వ ఉద్యోగి



సారంగాపూర్, ఆగస్టు 7: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ర్యాగల శివప్రసాద్ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్నాడు. పనిఒత్తిడిలో భాగంగా తన ఫోన్‌కు వచ్చిన మెస్సేజ్‌లను ఓపెన్ చేస్తున్న క్రమంలో తన వాట్సప్‌కు ఓ బ్యాంకుకు సంబంధించిన లోగోతో లింక్ వచ్చింది. బ్యాంకు సంబంధించినది అనుకుని ఓపెన్ చేయగా ఏటీఎం పిన్ఎంటర్ చేయమని అడగగా ఎంటర్ చేశాడు. దీంతో తన ఖాతా నుంచి రూ. 40 వేలు ట్రాన్స్‌ఫర్ అయినట్లు మెసేజ్ వచ్చింది. మోసపోయానని గ్రహించిన శివప్రసాద్ బ్యాంకు స్టేట్‌మెంట్ తీసుకుని సైబర్‌క్రైం అధికారులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బ్యాంకుకు సంబంధించిన లోగోతో కూడిన మెసేజ్ రావడంతో ఓపెన్ చేసి మోసపోయినట్లు బాధితుడు శివప్రసాద్ పేర్కొన్నారు.

దుంపెట వాసి ఖాతా నుంచి రూ.1.13లక్షలు..

కథలాపూర్: మండలంలోని దుంపెటకు చెందిన ఓ వ్యక్తి సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోయాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం...దుంపెటకు చెందిన వ్యక్తికి వాట్సాప్‌లో ఏపీకే ఫైల్ మెసేజ్ రాగా దాన్ని క్లిక్ చేశాడు. దీంతో 20 దఫాలుగా ఖాతా నుంచి రూ. 1,13,804లు గుర్తు తెలియని వ్యక్తి ఖాతాకు బదిలీ అయ్యాయి. యూనియన్ బ్యాంక్ ఖాతాను అప్‌డేట్ చేసుకోవాలని పేర్కొంటూ వచ్చిన మెసేజ్‌కు స్పందించడం వల్ల సైబర్ నేరగాళ్లు డబ్బులు మాయం చేశారని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించ వద్దని సూచించారు.


రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

బుగ్గారం ఆగస్టు7: మండలంలోని చిన్నాపూర్ గ్రామంలో ఓ వృద్ధుడు రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరా ల మేరకు చిన్నాపూర్ గ్రామానికి చెందిన కలమడుగు వెంకయ్య (76) బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో తన ఇంటి ముందు గల జాతీయ రహదారికి అవతలివైపునకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ధర్మపురి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం జరుగడంతో వెంకయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు కలమడుగు నర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బుగ్గారం ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

గల్ఫ్ కార్మికుడికి ప్రభుత్వ విప్ అండ

సిరిసిల్లక్రైం, ఆగస్టు 7: సౌదీలో అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న సిరిసిల్ల పట్టణంలోని సిద్దులవాడకు చెందిన మహ్మద్ ఇమ్రాన్ అనే 23ఏళ్ల యువకుడికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అండగా నిలిచారు. ఇమ్రాన్ స్వదేశా నికి వచ్చేందుకు అయ్యే విమాన టికెట్లు, ఇతర ఖర్చులను స్వయంగా భరిస్తానని బుధవారం తెలిపారు. ఇమ్రాన్‌ను త్వరలో స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బుధవారం సౌదీలో ఉన్న ఎన్ఆర్ఐ బైరి యాదవ్‌ను ఇమ్రాన్ వద్దకు పంపించి సురక్షితంగా ఇంటికి రప్పించేందుకు చర్యలు చేపట్టారు. ఇండియాకు వచ్చేందుకు అయ్యే ఖర్చులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలుపుతూ ఇమ్రాన్ వీడియో విడుదల చేశాడు.

జలపాతంలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


హర్షిత్ (ఫైల్)

తిర్యాణి, ఆగస్టు 7: తిర్యాణి మండలంలోని గుండాల జలపాతంలో సోమవారం గల్లంతైన పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన రిషి హర్షిత్(18) మృతదేహం బుధవారం జలపాతం మడుగులో లభ్యమైంది. మిత్రులతో కలిసి సోమవారం జలపాతం చూడటానికి వచ్చిన రిషి సెల్ఫీ తీసుకునే క్రమంలో జలపాతంలో జారిపడి గల్లంతయ్యాడు. రెండు రోజులపాటు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టి బుధవారం మృతదేహన్ని వెలికి తీశారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ సదయ్య, సీఐ చిట్టిబాబు, ఎస్సై రమేష్‌లు పరిశీలించి రిషి మృతదేహన్ని తిర్యాణి పీహెచ్‌సీకి తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సదయ్య మాట్లాడుతూ జలపాతాలకు వచ్చే సందర్శకులు జాగ్రత్తలు పాటించాలని, జాగ్రత్తలు తీసుకోకుండా ఈత రాని వారు నీటిలో దిగి సెల్ఫీలు దిగడం, రీల్స్ చేయడం వంటి వి చేపట్టకూడదన్నారు. మృతుడు సోదరుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

గంగాధర, ఆగస్టు 7: గంగాధర మండలం కురిక్యాలకు చెందిన అబ్బిడి అనిల్‌రెడ్డి(30) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ కిరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కురిక్యాల గ్రామానికి చెందిన అనిల్‌రెడ్డి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనారోగ్యంతో బాధపడుతూ మానసికంగా కుంగిపోయి మంగళవారం గ్రామ శివారులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ తరలించగా మెరుగైన వైద్యం కోసం ఎల్లారెడ్డిపేట మండలంలోని వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి మత్తులో పడొద్దు

తాండ్ర్యాల యువకుడి రిమాండ్

మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

కథలాపూర్, ఆగస్టు 7: గంజాయి మత్తులో పడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు సూచించారు. బుధవారం కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో తాండ్ర్యాలకు చెందిన కాసారపు వర్ధన్ అనే యువకుడు బుధవారం గంజాయి సరఫరా చేస్తుండగా ఎస్సై నవీన్ ఆధ్వర్యంలో పట్టుకోగా రిమాండ్ వివరాలను వివ రించారు. గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి పలు గ్రామాల్లో అధిక ధరకు విక్రయిస్తున్నట్టు సమాచారం రావడంతో పోసాని పేట శివారులో 160 గ్రాముల గంజాయితో వర్ధన్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి సేవించడం, విక్రయించడం వంటివి చేసి యువత భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని పిలుపునిచ్చారు. నిందితుడిని పట్టుకునేందుకు కృషి చేసిన సీఐ సురేశ్ బాబు, ఎస్సై నవీన్, కానిస్టేబుల్ పురుషోత్తం, నవీన్‌ను అభినందించారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

యువకుడి ఇంటి ఎదుట బైఠాయించిన యువతి

చొప్పదండి, ఆగస్టు 7: పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని ఓ యువకుడి ఇంటి ఎదుట ఓ యువతి బైఠాయించింది. ఎస్ఐ అనూష కథనం మేరకు.. చొప్పదండికి చెందిన చిటిపాక విక్రమ్‌కు మల్యాల మండలం తాటిపెల్లికి చెందిన యువతితో రెండేళ్ల క్రితం వివాహం నిశ్చయమైంది. తాను దుబాయి వెళ్లి వచ్చిన తరువాత పెళ్లి చేసుకుంటానని చెప్పిన విక్రమ్ ఆ తరువాత మాట మార్చి వేరే అమ్మాయితో వివాహం కుదుర్చుకొన్నాడు. ఈ విషయం తెలుసుకున్న యువతి విక్రమ్ ఇంటి ఎదుట బైఠాయించింది. ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తే సహించం

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ



శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ

సుభాష్‌నగర్, ఆగస్టు 7: రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సూర్యం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కేసీఆర్ ప్రభుత్వం విద్యా రంగాన్ని భ్రష్టు పట్టించిందన్నారు. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పోకడలు పోతోందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాలను విస్మరించి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. గత ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వం విద్య రంగానికి ఒక్క శాతం నిధులు మాత్రమే పెంచిందన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు కేవలం విద్యారంగంలో పనిచేసే ప్రభుత్వ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది జీతభత్యాలకే సరిపోతాయన్నారు. నూతన గురుకులాలకు సొంత భవనాలు, స్థలాల కేటాయింపు ఇప్పటివరకు జరగలేదన్నారు. ఇంటర్, డిగ్రీ కళాశాలల పరి స్థితి అస్తవ్యస్తంగా ఉందని వారు విమర్శించారు. యూనివ ర్సిటీల్లో కనీసం వైస్ చాన్సలర్లు, బోధన సిబ్బంది లేక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు నేటికీ విడుదల చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు, మెస్, కాస్మోటిక్ చార్జీలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. స్టూడెంట్ మెనేజ్‌మెంట్ హాస్టల్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్స్‌కు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులందరికీ ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం విద్యారంగంలో మతభావాలను వ్యాపింపచేస్తోందని వారు ఆరోపించారు. నిరుద్యోగ అంశాన్ని పట్టించుకోవడం లేదని వారు విమర్శించారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు అ న్యాయం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లైన్ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జిందం ప్రసాద్, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్, జిల్లా నేతలు ముల్కల మారుతి, లోకిని రమేశ్, సన్నీ, రాజేశ్, గణేశ్, రవికుమార్, దేవేందర్, మధుసూదన్, సాయి, స్వప్న, వందన పాల్గొన్నారు.

ఆర్థిక వివాదాలతో జర్నలిస్టు ఆత్మహత్య

తన మృతికి బిల్డర్ భార్య, మరో వ్యక్తి కారణమంటూ ఎమ్మెల్యేకు లేఖ


మధునయ్య (ఫైల్)

కోల్‌సిటీ, ఆగస్టు 7: గోదావరిఖనికి చెందిన సీనియర్ జర్నలిస్టు, సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి నాయిని మధునయ్య(62) ఆర్థిక వివాదాలతో బుధవారం తెల్లవారుజామున హనుమాన్‌నగర్‌లోని తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన చావుకు కొచ్చెర్ల ప్రవీణ్ అనే బిల్డర్ భార్య లలిత, పెద్దపల్లి పోషయ్యలు కారణమని పేర్కొన్నారు. ఈ మేరకు రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ పేర తన సెల్‌లో మరణ వాంగ్మూలం లేఖ పెట్టాడు. పోలీసులు తెలిపిన వివరాలు...

గోదావరిఖనికి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి నాయిని మధునయ్య (62) మల్కాపూర్ శివారులోని జర్నలిస్టు కాలనీలో ఒక ఇల్లు నిర్మించుకునేందుకు కొచ్చెర్ల ప్రవీణ్ అనే బిల్డర్‌తో రూ.40 లక్షలకు అగ్రిమెంట్ చేసుకున్నాడు. పలు దఫాలుగా ఒప్పందాన్ని మించి రూ.60 లక్షలు చెల్లించాడు. మధునయ్య ఇంటి పక్కన ఉన్న స్థలాన్ని విక్రయిస్తానంటూ ప్రవీణ్ మధునయ్య వద్ద మరో రూ.13లక్షలు తీసుకున్నాడు. కానీ ఆ భూమిని అప్పటికే ప్రవీణ్ పెద్దపల్లి పోషయ్య అనే వ్యక్తిపేర రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ విషయం మధునయ్యకు తెలియడంతో నిలదీయగా ఆ భూమిలో ఇల్లు నిర్మించి రిజిస్ట్రేషన్ చేయిస్తానని మాట ఇచ్చాడు. ఏడాది క్రితం బిల్డర్ ప్రవీణ్‌ను అతని భార్య లలిత హత్య చేయించింది. ఈ కేసులో లలిత జైలుకు వెళ్లి వచ్చిన తరువాత మధునయ్య ఇంటి నిర్మాణం గురించి, పక్కన ఉన్న స్థలం రిజిస్ట్రేషన్ గురించి పలు మార్లు సంప్రదించారు.

ఈ నెల 4న లలిత, పెద్దపల్లి పోషయ్యలు జర్నలిస్టు కాలనీలోని స్థలం వద్దకు రాగా మధునయ్య, మరో ఇద్దరు వ్యక్తులు వెళ్లి డబ్బుల గురించి అడిగారు. ఆ సమయంలో గొడవ జరిగి బూతులు తిట్టారని, అప్పటి నుంచి తన తండ్రి మానసికంగా కృంగిపోయి ఆత్మహత్య చేసుకున్న ట్టు మధునయ్య కొడుకు హరీష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాగా తన తండ్రి మృతికి కొచ్చెర్ల లలిత, పెద్దపల్లి పోషంలు కారణమని, వారిపై చర్యలు తీసుకోవాలని నాయిని హరీష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు కొచ్చెర్ల లలిత, పెద్దపల్లి పోషంలపై బీఎన్ఎస్ 108 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

వానాకాలం సాగుకు శ్రీరాంసాగర్ నీరు విడుదల


ఎస్సారెస్పీ నీటిని విడదుల చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

జగిత్యాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సాగు అవసరాల కోసం శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నీటిని బుధవారం అధికారు లు, ప్రజాప్రతినిధులు విడుదల చేశారు. పోచంపాడ్ ఎస్సారెస్పీ ప్రాజెక్టు వద్ద కాకతీయ కాలువ ద్వారా సాగునీటి సరాఫరాను బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. అదే విధంగా సరస్వతీ కాలువకు నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి నీటి విడుదల ప్రారంభిం చారు. వానా కాలం సాగు సీజన్‌కుగాను ఎస్సారెస్పీ నీటిని రైతు లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా వారాబందీ పద్ధతి లో సాగు నీటి సరాఫరా కొనసాగించనున్నట్లు అధికారులు ప్రకటిం చారు. కాకతీయ కాలువకు 1,000 క్యూసెక్కుల నీటిని, సరస్వతీ కాలువకు 100 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 50 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్‌రావు, ఈఈ చక్రపాణి, పోచంపాడ్ ఎంహెచ్ఎస్ అండ్ సోలార్ సీఈ రమేశ్‌బాబు, డీఈ జె శ్రీనివాస్, డీఈఈలు,ఏఈఈలు, టీఎస్ జెన్‌కో అధికారులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలు, విష్ణుపురి, అంబూరా, బాలేగావ్ ప్రాజెక్టులు నిండుగా ఉండడం కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. బుధవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగు తోం ది. ఎస్సారెస్పీలోకి 11,055 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 46.952 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమ యానికి ప్రాజెక్టులో 76.894 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరము లకు కలిపి ప్రాజెక్టు నుంచి 1,983 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 42.145 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

గణేశ్‌నగర్, ఆగస్టు 7: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని టీజీ ఎన్పీ డీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో గల విద్యుత్ శాఖలోని ఎం ఆర్టీ, డివిజన్‌లో గల ఎల్‌టి మీటర్స్ ల్యాబ్‌లో సెమీ ఆటోమేటిక్ టెస్ట్ బెంచ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరిక రంతో అత్యంత కచ్చితత్వంతో అన్ని రకాల మీటర్లను పరీక్ష చేయవచ్చని తెలిపారు. వివిధ రకాల పరీక్షలు ఒకేసారి 20 మీటర్లుకు చేయవచ్చన్నారు. అనంతరం డివిజన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్ఈ ఆపరేషన్ కరీంనగర్ వి.గంగాధర్, డీఈ టెక్నికల్, కరీంనగర్ విజేందర్‌రెడ్డి, కె.కాళిదాసు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న వరుణ్‌రెడ్డి

కొండగట్టులో సహస్రనామ కుంకుమార్చన

మల్యాల, ఆగస్టు 7: కొండగట్టు శ్రీ అంజనేయ స్వామి సన్నిధిలో జరుగుతున్న శ్రావణ సప్తాహ ఉత్సవాలలో భాగంగా బుధవారం అండాళ్ తిరు నక్షత్రం పురస్కరించుకొని అండాళ్ అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. ఆంజనేయస్వామికి 108 కమలాలతో అర్చన, వెంకటేశ్వరస్వామికి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజలలో ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధానర్చకులు రామకృష్ణ, జితేంద్ర ప్రసాద్ అర్చకులు, వేదపండితులు,విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 7: సిరిసిల్ల పట్టణంలోని మానేరు బ్రిడ్జి కింద బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఈ మృతదేహం కుళ్లిపోవడంతో నాలుగు రోజుల క్రితం మృతిచెంది ఉండవచ్చని పేర్కొన్నారు. మృతి చెందని వ్యక్తి వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందని, నీలిరంగు షర్టు, నీలిరంగు పాయింట్ ధరించి ఉన్నాడని తెలిపారు. గుర్తించిన వారు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్ 98666 20105 నంబరులో సమాచారం అందించాలని తెలిపారు.

కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో సహాయ నిధి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 7:జగిత్యాల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు బోగోజి ముఖేష్ ఖన్నా ఆధ్వర్యంలో కేరళ వయనాడ్ వరద బాధితులకు సహాయార్థం నిధి సేకరణ కార్యక్రమాన్ని స్థానిక ఇందిరాభవన్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సేవాదళ్ ఉత్తర తెలంగాణ జిల్లాల ఇంచార్జి నీ కంటేశ్వర్‌రావు చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మారుతీ బాపూజీ, ధర్మపురి సేవాదళ్ అధ్యక్షు లు చంద్రయ్య, పీసీసీ సభ్యులు గిరి నాగభూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, రాజేందర్, రాజు, ప్రకాష్ కుమార్, అజయ్, కిరణ్ తదితరులున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెగడపల్లి, ఆగస్టు 7: సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని పెగడపల్లి ఏఎస్ఐ సత్తయ్య పేర్కొన్నారు. బుధవారం పెగడపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని గంజాయి లాంటి వాటి విక్రయాలపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సదస్సులో ప్రిన్సిపాల్ సుంకరి రవి, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

పెగడపల్లిలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

పెగడపల్లి, ఆగస్టు 7: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పెగడపల్లి మండల కేంద్రంలో బుధవారం వర్గీకరణ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణపై తప్పుడు నిర్ణయాలు తీసుకున్నాయని అట్టి నిర్ణయాన్ని పునపరిశీలన చేయాలన్నారు.కార్యక్రమంలో మాల సంఘాలనాయకులు మేరుగు శ్రీనివాస్, బత్తుల ప్రదీప్, యేసురత్నం, చందు, రాజశేఖర్, అశోక్, వినోద్, రెడ్డి, వెంకట్రాజం, రాయలింగు పాల్గొన్నారు.

కొడిమ్యాలలో నేత్ర వైద్య కేంద్రం ప్రారంభం

కొడిమ్యాల, ఆగస్టు 7: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో బుధవారం ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వారి ప్రాథమిక నేత్ర వైద్య కేంద్రాన్ని కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ ప్రారంభించారు. ప్రతి రోజు ఉచిత కంటి సమగ్ర పరీక్షలను నిర్వహించనున్నారు. కార్యక్రమంలో తాజామాజీ సర్పంచు మమతనర్సింహారెడ్డి, నారాయణగౌడ్, మహిపాల్‌రెడ్డి, మల్లిఖార్జున్ రెడ్డి, జీవన్‌రెడ్డి, ప్రసాద్, చంద్రమొహన్‌రెడ్డి మల్లారెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఏఈగా జగదీశ్వర్

కథలాపూర్, ఆగస్టు 7: పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజినీర్‌గా బైరి జగదీశ్వర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సాధారణ బదిలీల్లో భాగంగా బాసరలో పనిచేస్తున్న జగదీశ్వర్ కథలాపూర్‌కు వచ్చారు. ఇక్కడ మల్యాల నుంచి డిప్యూటేషన్‌పై కొనసాగుతున్న జ్ఞానేశ్వర్ యథాస్థానంకు వెళ్లనున్నారని తెలిసింది. అయితే గతంలో చేపట్టిన పనులు పూర్తి స్థాయిలో రికార్డు చేసేదాకా కథలాపూర్‌లో కొనసాగించేలా నాయకులు సంబంధిత శాఖ ఉన్నతాధికారుల వద్ద సిఫార్సు చేశారని సమాచారం.

మండల రెవెన్యూ సర్వేయర్‌గా రమేశ్

కథలాపూర్, ఆగస్టు 7 : మండల రెవెన్యూ సర్వేయర్‌గా సిహెచ్ రమేశ్ కథలాపూర్‌కు బదిలీపై వచ్చారు. ఈ మేరకు బుధవారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. దాదాపుగా రెండు సంవత్సరాల నుంచి రెగ్యులర్ సర్వేయర్ ఇక్కడ లేకపోగా లైసెన్స్‌డ్ సర్వేయర్‌తో భూమి కొలతలు వేయించారు.

పోసానిపేటలో విద్యుత్ అధికారుల పొలం బాట

కథలాపూర్, ఆగస్టు 7: మండలంలోని పోసానిపేటలో బుధవారం విద్యుత్ అధికారులు పొలం బాట నిర్వహించారు. పొలాల వద్దకు వెళ్ళి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు వివరించారు. వ్యవసాయ పంపుసెట్లకు కెపాసిటర్లు బిగించుకుంటే నాణ్యమైన విద్యుత్ సరఫరా కావడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ఏడీఈ తిరుపతి, ఏఈలు జమీల్‌పాషా, భూమేశ్వర్, నవీన్, మాజీ సర్పంచ్ ఎంజీరెడ్డి ఉన్నారు.

'జర్నలిస్టుల పోరాటానికి అండగా ఉంటాం'

జగిత్యాల అర్బన్, ఆగస్టు 7: జగిత్యాల పట్టణంలోని స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట నివేశన స్థలాల కోసం ఐదో రోజు చేపట్టిన నిరసన దీక్షకు ఎమ్మెల్సీ ఎల్ రమణ, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, రాజేశం గౌడ్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సంఘీభావం తెలిపారు. జర్నలిస్టులకు న్యాయం జరిగేవరకు అండగా ఉంటామన్నారు. వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు గౌతమ్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, పెన్షనర్స్ అసోసి యేషన్ సభ్యులు హరి అశోక్‌కుమార్, ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ బాధ్యులు రాజగోపాలాచారిలు సంఘీభావం ప్రకటించగా, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గిరి నాగ భూషణం దీక్షను నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

● జగిత్యాల డీఎస్పీ రఘుచందర్

గొల్లపల్లి, ఆగస్టు 7: ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం వల్ల ఎక్కువ శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అన్నారు. గొల్లపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు విద్యార్థులకు షీ టీమ్, కళాబృందంతో కలిసి ట్రాఫిక్ నియమకాలు, గంజాయి వల్ల కలిగే అనర్థాలు, సైబర్ మోసాలు, నూతన చట్టాల గురించి అవగాహన కల్పించారు. సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఫోటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గొల్లపల్లి ఎస్సై సతీష్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లేశం, శ్రీనివాస్, షీ టీమ్ ఎస్సై బేగ్, షీ టీమ్, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

రాయికల్, ఆగస్టు 7: మండలంలోని అయోధ్య ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు పొన్నం రమేష్, విజయ్ కుమార్, రాజేశం, రూపావతి, శోభ, రాజమల్లీశ్వరిని గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అలాగే కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ జీవన్‌రెడ్డి, చైర్మన్ గంగజల, గంగాధర్, ఉపాధ్యాయులు అలిశెట్టి అమరేందర్, గుర్రం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దళితులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ధర్మపురి, ఆగస్టు 7: కాంగ్రెస్ పార్టీ దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ బీజేపీ దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దొనకొండ నరేష్ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కృష్ణచైతన్యకు బుధవారం నాయకులు వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దొనకొండ నరేష్, ధర్మపురి పట్టణ అధ్యక్షులు బెజ్జారపు లవణ్, అసెంబ్లీ కో కన్వీనర్ బండారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

గల్ఫ్ ఉద్యోగార్థులకు అవగాహన

జగిత్యాలరూరల్, ఆగస్టు 7 : తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణశాఖ అనుబంధ సంస్థ తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టాంకాం)సంస్థ హైదారాబాద్‌లోని మాసాబ్‌టాంక్ మల్లేపల్లి ఐటీఐ ఆవరణలో గల్ఫ్ తదితర దేశాలకు వెళ్లేవారికి ఒక రోజు ముందస్తు ప్రయాణ అవగాహన శిక్షణ (పిడిఓటి) కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. శిక్షణ కేంద్రాన్ని ప్రవాసీ సంఘాల ప్రతినిధుల బృందం మాజీ ఐఎఫ్ఎస్ అధికారి, మాజీ ఇండియన్ అంబాసిడర్ డా. బిఎం వినోద్‌కుమార్ నాయకత్వంలో వలస కార్మిక నాయకుడు మంద భీంరెడ్డి, తెలంగాణ గల్ఫ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నంగి దేవేందర్‌రెడ్డి తదితరులు టాంకాంను సందర్శించారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ

రాయికల్, ఆగస్టు 7: నవజాత శిశువులకు తల్లిపాలే అమృతతుల్యమైనవని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 21 మంది గర్భిణీలు, బాలింతలకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి, క్లబ్ మాజీ జడ్‌సీలు మ్యాకల రమేష్, బత్తిని భూమయ్య, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల నరేష్ ఉన్నారు.

గంబూషియా చేపల విడుదల

రాయికల్,ఆగస్టు7: రాయికల్ పట్టణంలో బుధవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌లు కలిసి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లోని కుంటలు, నీరు నిలిచిన ప్రాంతాల్లో గంబూషియా చేపలను వదిలారు. కౌన్సిలర్ మ్యాకల అనురాధ, మేనేజర్ వెంకటి, మున్సిపల్ ఇంజనీర్ ప్రసాద్ పాల్గొన్నారు.

రామలచ్చక్కపేటలో డెంగ్యూ కేసు నమోదు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 7: రామలచ్చక్కపేట గ్రామంలో ఒక డెంగ్యూ కేసు నమోదైందని, చికిత్స కోసం మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వైద్యాధికారి అంజిత్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం జగ్గసాగర్, ఆత్మనగర్ గ్రామాల్లో 20 నుంచి 30మంది జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది.

పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు తాగించాలి



అన్నప్రాసన చేయిస్తున్న డాక్టర్ నరేష్ దృశ్యం



లింగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతం వేడుకలు



వెంగళాపూర్‌లో హ్యాండ్‌వాష్ పద్ధతిని వివరిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ధర్మపురి, ఆగస్టు 7: పుట్టిన ప్రతి బిడ్డకు తల్లి పాలు ఖచ్చితంగా ఇవ్వాలని జగిత్యాల జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ బోనగిరి నరేష్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎస్‌హెచ్ గార్డెన్స్‌లో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి పాలు తన బిడ్డకు ఇవ్వడం అనేది మొదటి కానుక అని పేర్కొన్నారు. చిన్న పిల్లలకు అన్న ప్రాసన చేయించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, జగిత్యాల డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ధర్మపురి సీడీపీవో శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

● జగిత్యాల అర్బన్: పట్టణంలోని స్థానిక ఏడవ వార్డులో గల అంగన్వాడీ సెంటర్‌లో అరవింద్ నగర్-1లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవితారాణి, వార్డు కౌన్సిలర్ వల్లెపు రేణుక మొగిలి, అంగన్వాడీ టీచర్ భగవద్గీత, ఏఎన్ఎం ఉజ్వల, ఆశా కార్యకర్తలు సావిత్రి, యమున తదితరులు పాల్గొన్నారు.

● జగిత్యాలరూరల్ :జగిత్యాల అర్బన్ మండలంలోని మోతె, రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామాల్లో బుధవారం తల్లిపాలవారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మోతె ప్రత్యేకాధికారి వరదన్, నర్సింగాపూర్ ప్రత్యేకాధికారి శ్రీనివాస్, అర్బన్ ఎంపీడీఓ ఆయా గ్రామాల్లోని నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్యాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, పంచాయితీకార్యదర్శి రాజిరెడ్డి పాల్గొన్నారు.

● రాయికల్: మండలంలోని రామాజీపేట గ్రామంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మహేష్, అంగన్‌వాడీ టీచర్లు జుంబర్తి జమున, నాగెల్లి రమాదేవి, బెజ్జంకి భాగ్యలక్ష్మి, కొల్లూరు నిషిత, ఆశా వర్కర్లు లత, మమత, లావణ్య పాల్గొన్నారు.

● భీమారం: మండలంలోని మన్నెగూడెం గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం శ్రీలత, ఎంఎల్‌హెచ్‌పీ సుజాత, గ్రామ కార్యదర్శి ఇలయ్ చంద్ర, కారోబార్ సత్యం, వీవోఏలు పాల్గొన్నారు.

● గొల్లపల్లి: మండలంలోని వెంగళాపూర్ గ్రామంలో బుధవారం మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. హ్యాండ్ వాష్ పద్ధతులను తల్లులకు చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ సరోజన, ఆశ కార్యకర్త మంజుల పాల్గొన్నారు.

● కొడిమ్యాల: మండలంలోని నమిలికొండ అంగన్‌వాడీ కేంద్రాలలో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్లు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంకిషన్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధారాణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

● పెగడపల్లి : తల్లి పాలే బిడ్డకు ఆరోగ్యకరమని చిన్నారులకు డబ్బా పాలు కాకుండా తల్లి పాలే తాగించాలని హెల్త్ సూపర్‌వైజర్ జయశీల పేర్కొన్నారు. తల్లి పాల వారోత్సవాలలో భాగంగా బుధవారం పెగడపల్లి మండలంలోని లింగాపూర్ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో అక్షరాభ్యాసం, అన్నప్రాసన, సీమంతం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ రూప, సుహాసిని, కార్యదర్శి లావణ్య, ఆరోగ్య సిబ్బంది, శోభారాణి, లలిత, మాజీ ఎంపీటీసీ పూసాల శోభ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

●గొల్లపల్లి: మండలంలోని వెంగళాపూర్ గ్రామంలో బుధవారం మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను గర్భిణీలు, బాలింతలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ సరోజన, ఆశ కార్యకర్త మంజుల పాల్గొన్నారు.

● మెట్‌పల్లి రూరల్: అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించడంతో వ్యాధి నిరోధిక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ హైమాది బేగం అన్నారు. మండలంలోని కోనరావుపేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు.

● కథలాపూర్ : తల్లి పాలే బిడ్డకు ఎంతో బలవర్ధకంగా ఉంటుందని అంగన్‌వాడీ టీచర్లు సూచించారు. మండలంలోని సిరికొండ, దుంపెట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ టీచర్లు సునంద, సుమలత, ప్రతిభ ఉన్నారు.

● కోరుట్ల : పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని వార్డు సభ్యురాలు పుప్పాల ఉమారాణి-ప్రభాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఏసీకోని గుట్ట ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడారు. పట్టణంలోని రాంనగర్ ప్రాతంలోని అంగన్‌వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించంగా వార్డు కౌన్సిలర్ మ్యాడవేణి నరేష్ పాల్గొని పౌష్టికాహారం పంపిణీ చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కొడిమ్యాలలో మొక్కనాటి నీరుపోస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



కోరుట్లలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ తిరుపతి

కొడిమ్యాల, ఆగస్టు 7: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం కొడిమ్యాల గ్రామ శివారులోని పంప్‌హౌస్ సమీపంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రజలంతా బాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఇంటి ఆవరణలో పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతి ఇంటికి 5 మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. సీజనల్ వ్యాదులు ప్రభలకుండా సంబందిత అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. అంతకు ముందు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో 37 మందికి 37లక్షల 4వేల 292 రూపాయల విలువగల కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీలాందర్ రాజమణి, ఎంపీడీవో స్వరూప, ఏపీవో సతీష్, ఎంపీవో వాసవి, కార్యదర్శి వంశీవర్ధన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, వర్కింగ్ ప్రెజిడెంట్ జీవన్‌రెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

● పెగడపల్లి: స్వచ్ఛదనం - పచ్చదనం ప్రతి పౌరుడి బాధ్యతగా బావించినపుడే ప్రభుత్వం సాదించాలనుకున్న లక్ష్యం నెరవేరుతుందని పెగడపల్లి ఎంపీడీఓ ఎ.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుదవారం పెగడపల్లి మండలంలోని మద్దులపల్లితో పాటు అన్ని గ్రామాలలో ర్యాలీలు నిర్వహించడంతో పాటు ఇంటింటికీ తిరిగి నీటి నిల్వలు లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమాలలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డితో పాటు ఎంపీవో మహేందర్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ప్రవీణ్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● కోరుట్ల రూరల్: ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని డీపీఓ రఘువరన్ గ్రామస్థాయి అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని అయిలాపూర్ గ్రామంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉన్న ఇంకుడు గుంతలో చెత్త చెదారంతో నిండడంతో డీపీఓ గ్రామ పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించారు. అనంతరం గ్రామంలోని పలు వార్డులను సందర్శించారు. తహసిల్దార్ కిషన్, ఎంపీడీఓ రామకృష్ణ, మండల వ్యవసాయ అధికారిణి నాగమణి, ఏపీఓ కృపాకర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

● కోరుట్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాలతో పరిసరాల పరిశుభ్రంగా ఉంటాయని మున్సిపల్ కమిషనర్ తిరుపతి అన్నారు. బుధవారం పట్టణంలోని పలు వార్డులలో ఉన్న ప్రభుత్వ సంస్థలు, కూరగాయల మార్కెట్‌లో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులలో నిలువ ఉన్న నీటిని తొలగించడానికి తాత్కాలిక డ్రైన్‌లను ఏర్పాటుచేసి నీటిని తొలగించారు. చేతి పంపుల వద్ద నిలువ నీటిని తొలగించారు. మురికి కాలువలో బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రపరిచారు. పలు వార్డులలో వార్డు సభ్యులు పూల మొక్కలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు సభ్యులు, ఆర్‌పీలు, మహిళ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్తం సమాచారం

● ధర్మపురి: ధర్మపురి పట్టణానికి చెందిన కనపర్తి ప్రభాకర్‌కు ఆలయ ఫౌండేషన్ సహకారంతో కృతిమ కాలు ఉచితంగా అమర్చారు. పరికిపండ్ల నరహరి (ఐఏఎస్) చొరవతో హైదరాబాద్‌లోని మహావీర్ సంస్థాన్ వారి సహకారంతో కృతిమ కాలు అమర్చారు.

● ధర్మపురి: ధర్మపురి పట్టణంలోకి కస్తూరి బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలను జగిత్యాల జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష బుధవారం తనిఖీ చేశారు. పాఠశాల ప్రత్యేక అధికారి శ్రీలత తదితరులు ఉన్నారు.

● కోరుట్ల: జనగామ జిల్లాలో న్యాయవాద దంపతులు అమృతరావు - కవితలపై దాడి చేసిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తస్నీర్ శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ సభ్యులు సుతారి శ్రీనివాస్ రెడ్డి, చిలివేరి రాజశేఖర్, కోంపల్లి సురేష్ పాల్గొన్నారు.

● మెట్‌పల్లి (ఇబ్రహీంపట్నం): న్యాయవాదులపై దాడులు చేస్తే సహించేది లేదని మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల లింబాద్రి అన్నారు. సిరిసిల్ల, జనగామ కోర్టు పరిధిలో పోలీస్‌లు అక్కడి న్యాయవాదులపై దౌర్జన్యం చేయడాన్ని నిరసిస్తూ మెట్‌పల్లి కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ప్రధాన కార్యదర్శి తునికి వేణుగోపాల్, సంయుక్త కార్యదర్శి రాంపల్లి జగన్, న్యాయవాదులు శ్రావంతి ఉన్నారు.

● ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను బుధవారం జడ్పీ సీఈఓ, మండల ప్రత్యేకాధికారి రఘువరన్ తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఎంపిడిఓ రాజేందర్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

● మెట్‌పల్లి (ఇబ్రహీంపట్నం): పట్టణంలోని సాయి బాబా ఆలయం నుంచి రైల్వేస్టేషన్ వరకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సుఖీభవ ఆర్గనైజేషన్ వ్యవస్థపకులు బొక్కెనపల్లి నాగరాజ్ వినతిపత్రం అందిచారు. పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. కుక్కల బెడద నివారించాలని క్రోనోకార్పస్ చెట్లను తొలగించి వాటి స్థానంలో గ్రీనరీ చెట్లు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ సాధన నాయకులు నాంపల్లి గట్టయ్య, నాయకులు లక్ష్మణ్, స్వామి, ప్రకాస్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

● కొడిమ్యాల: మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామానికి చెందిన తల్లిదండ్రిలేని చిన్నారులు మణిదీప్, దివ్యశ్రీలకు బుధవారం కొడిమ్యాల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ పత్తెం రాజయ్య 5,016 రూపాయలను అందించారు. ఇటీవల చిన్నారుల తల్లి, తండ్రి మృతి చెందారు. హెడ్ కానిస్టేబుల్ ఔదార్యాన్ని గ్రామస్థులు అభినందించారు. హెడ్ కానిస్టేబుల్ వెంట గ్రామ ప్రముఖులు దుబ్బాక శ్రీనివాస్, బొక్కెన ప్రకాష్, ఎడపెల్లి ప్రశాంత్, సుకుమార్, మనోహర్ ఉన్నారు.

● మెట్‌పల్లి రూరల్: మండలంలోని పెద్దాపూర్ క్యాంపులో తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో పాముకాటుతో అస్వస్థతకు గురైన ఇద్దరు విద్యార్థులు ఇంటికి చేరుకున్నట్లు గురువారం మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి తెలిపారు. గురుకుల పాఠశాలలోని విద్యార్థులు రాపర్తి హర్షవర్ధన్, అడెపు గణేష్‌లు జూలై 26న పాముకాటుతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో విద్యార్థులను చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు అస్వస్థతకు గురైన హర్షవర్ధన్, గణేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు డీఎంహెచ్‌వో శ్రీనివాస్, సమీయొద్దీన్, మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి తరలించారు. అక్కడే అధికారులు ఉండి విద్యార్థుల వైద్య సేవలను పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందించారు. రాపర్తి హర్షవర్ధన్ జూలై 30న, అడెపు గణేష్ జూలై 31న ఇంటికి చేరుకున్నట్లు అధికారులు తెలిపారు.

● కొడిమ్యాల: మండలంలోని నర్సింహులపల్లి గ్రామానికి చెందిన టీఆర్‌ఎస్ నాయకుడు కంబళ్ల నాంపెల్లి మంగళవారం రాత్రి మృతి చెందగా, ఇటీవల పూడూర్‌కు చెందిన కందుల రాజశేఖర్ హత్యకు గురికాగా మృతుల కుటుంబ సభ్యులను బుధవారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ పరామర్శించారు.

● మల్యాల: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని రామన్నపేట సర్పంచ్ వకులాభరణం శ్రీనివాస్, కొండగట్టుకు చెందిన ఒల్లాల రాజేశ్వరీ, గుర్రం మల్లేశంగౌడ్, ముత్యంపేటకు చెందిన మల్యాల గంగాధర్ కుటుంబసభ్యులను ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు.

● కొడిమ్యాల: వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించి పదోన్నతిపై ఇటీవల కరీంనగర్ సివిల్ ఆసుపత్రికి అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియామకమైన మండల కేంద్రానికి చెందిన పర్లపల్లి జితేందర్‌ను దళిత సంఘం ఆధ్వర్యంలో బుధవారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ప్రసాద్, డి. నర్సయ్య, కొత్తూరి స్వామి, రవీందర్, లక్ష్మన్, ప్రభుదాస్, మహేష్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలి : ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 7 : వానాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే ఆవకాశం ఉన్నందున ముందస్తుగా గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సూచించారు. బుధవారం మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో కార్యదర్శులు, ప్రత్యేకాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి జడ్పీ సీఈవో రఘువరన్‌తో కలిసి హాజరయ్యారు. గ్రామాల్లోని సమస్యలను కార్యదర్శులు, ప్రత్యేకాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తచెదారాలు ఎక్కువయ్యాయని, వాటిని తొలగించి ప్రతి నిత్యం పారిశుద్యం పనులు చేపట్టాలన్నారు. సీజనల్‌లో ముఖ్యంగా గ్రామాలో జ్వరం, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వస్తుంటాయి. ఇళ్లల్లోని నీరు నిల్వ ఉంచకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రామాల్లోని డ్రైనేజీలను శుభ్రం చేస్తూ బ్లీచింగ్ వేయాలన్నారు. గ్రామాల్లో గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలకి ఎన్నికల కోడ్ సమయంలో మూసి ఉంచిన పేపర్లు, సున్నం, పోస్టర్లు తొలగించాలని సూచించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, ఇంచార్జి ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోనోకార్పస్ మొక్కల తొలగింపుపై హర్షం

కోరుట్ల, ఆగస్టు 7 : పట్టణంలోని జాతీయ రహదారిపై ఉన్న కోనోకార్పస్ మొక్కల తొలగింపుపై జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తిరుపతి, మేనేజర్ శ్రీనివాస్‌లను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో జనసేన నేతలు రామారావు, సాయికృష్ణ, అభినవ్, విజయ్, రమేష్, శ్రీనివాస్, నరహరి, విజయ్, రాజు, నవీన్ పాల్గొన్నారు.

దేవాలయ భూముల హద్దులు నిర్ణయించిన అధికారులు

కోరుట్ల, ఆగస్టు 7 : పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయ భూముల హద్దులను బుధవారం దేవాలయ, రెవెన్యూ అధికారులు నిర్వహించారు.దేవాలయ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని బీజేపీ వార్డు కౌన్సిలర్ పెండం గణేష్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా కలెక్టర్ సర్వేకు ఆదేశించారు. తహసిల్దార్ కిషన్, జోనల్ సర్వేయర్ అనిల్, పట్టణ సర్వేయర్ కుమారస్వామి, దేవాలయ ఈఓ విక్రం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రవీణ్, రమ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

అనుమతి లేని ప్రైవేటు పాఠశాలల తరగతులు మూసివేత

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 7 : మండలంలోని గోధుర్, వేములకుర్తి గ్రామాలలో ప్రైవేటు పాఠశాలలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ప్రీప్రైమరీ తరగతులను మూసివేసినట్లు ఎంఈఓ ఆనంద్‌రావు తెలిపారు. గోధుర్ గ్రామంలో మాస్టర్ కాన్వెంట్ స్కూల్, వేములకుర్తి గ్రామంలోని న్యూవిజన్ ప్రైవేటు పాఠశాలలో ప్రీప్రైమరీ తరగతులకు ఎలాంటి పర్మిషన్ లేకుండా నిర్వహిస్తున్నారని అధికారుల ఆదేశాల మేరకు రెండు పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను మూసి వేసి పిల్లలను ఇంటికి పంపించినట్లు తెలిపారు.

మండలంలో సామాజిక బహిష్కరణ

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 7:మెట్‌పల్లి మండలంలోని ఓ గ్రామంలో ఓ వర్గాన్ని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సామాజిక బహిష్కరణ చేసినట్లు చర్చ జరుగుతోంది. గ్రామంలోని భూమికి సంబంధించిన వివాదంలో వీడీసీ సభ్యులు సామాజిక బహిష్కరణ విధించారు. వీడీసీపై బహిష్కరణకు గురైన వారు పోలీసులను సంప్రదించినట్లు సమాచారం. దీనిపై గురువారం గ్రామంలో అధికారులు విచారణ చేపట్టనున్నట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

జాతీయ రహదారి భూ నిర్వాసితుల ఆవేదన



అధికారులకు సమస్యలు తెలుపుతున్న రైతులు

వెల్గటూర్, ఆగస్టు 7: పొట్ట గడవడానికి ఆధారమైన ఉన్న కాస్త భూమి పోతే ఎట్లా బతకాలని జాతీయ రహదారి-63 భూ నిర్వాసితులు మండిపడ్డారు. 68 మంది రైతులకు అవార్డులు అందజేయగా, ప్రభుత్వం వెంటనే రహదారి విస్తరణ పనులు నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. బుధవారం ఆర్డీవో మధు సుదన్ ఆధ్వర్యంలో వెల్గటూర్ మండల పరిషత్ కార్యాయలంలో రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నేషనల్ హైవే-63 విస్తరణలో బాగంగా 68 మంది రైతులకు సంబంధించి 33.8 ఎకరాల భూమి కోల్పోతున్నట్లు గుర్తించామన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు అక్కడ ఉన్న మార్కెట్ విలువ ప్రకారం పరిహారం అందజేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రహదారి నిర్మాణానికి రైతులు సహకరించాలని కోరారు. కాగా ఇప్పటికే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయామని, జాతీయ రహదారి నిర్మాణం పేరిట ఉన్న కాస్త భూమిని లాక్కుంటే ఎట్లా బతకాలని రైతులు మండిపడ్డారు. భూములు కోల్పోతున్న వారిలో ఎకరం, అర ఎకరం ఉన్న చిన్న, సన్నకారు రైతులే ఎక్కువగా ఉన్నారని అదీ కూడా పోతే కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎకరానికి అందజేసే పరిహారంతో బయట కనీసం పది గుంటల భూమి కూడా కొనలేమన్నారు. గతంలో ఇథనాల్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడానికి అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందుకు రాగా ఇక్కడి ప్రలు తీవ్రంగా వ్యతిరేకించి పోరాడడం వలన వెనక్కి తగ్గారని గుర్తు చేశారు. ఒక వేళ జాతీయ రహదారి నిర్మాణంలో ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే ఈ ప్రాంత ప్రజలు మరో ఉద్యమానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ శేఖర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీంధర్‌రెడ్డి, ఆర్ఐ రాజేశ్వరి, రైతులు పాల్గొన్నారు.